విశ్వనగరంగా రాజమహేంద్రవరం

- ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి
- ఎంపీ భరత్‌రామ్


క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ఎంపీగా కేవలం మూడేళ్లలో నగరాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దానని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే విశ్వనగరంగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆయన గురువారం స్థానిక 40వ డివిజన్‌లోని మూలగొయ్యి, సీతంపేట, తాడితోట ప్రాంతాలలో పర్యటించారు. ఎంపీగా నగరంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఆయా ప్రాంతాలలో పోస్టర్లు పంపిణీ చేశారు. నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ అందించిన సహకారం మరువలేనిదన్నారు. సుమారు రూ.400 కోట్లతో నగరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దామన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి విమానాశ్రయానికి, రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.600 కోట్లు మంజూరు చేయించామన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి కావస్తోందన్నారు. కేంద్రం నిధులే కావచ్చు కానీ ఎంపీగా కష్టపడి సాధించకపోతే నిధులు మంజూరు కావన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా జగనన్నతోనే సాధ్యమని ఎంపీ భరత్‌రామ్ అన్నారు. ఇటువంటి మంచి ప్రభుత్వాన్ని పది కాలాల పాటు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, కార్యకర్తలు, అభిమానులు, ఆయా వార్డు పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

నగరంలో సంఘ విద్రోహక శక్తులను పెంచి పోషిస్తూ, వడ్డీలతో ప్రజలను ఇక్కట్ల పాలు చేసే ఆదిరెడ్డి కుటుంబం అంటే తెలియని వారెవ్వరూ నగరంలో ఉండరని, ఆ కుటుంబం అంత ఘనత సాధించిందని ఎంపీ భరత్‌రామ్ ఎద్దేవా చేశారు. 48వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి పలువురు యువకులు ఎంపీ భరత్‌రామ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఆదిరెడ్డి అప్పారావు, ఆయన తనయుడు వాసు చేసేవే చీకటి వ్యాపారాలన్నారు. గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్, రౌడీ షీటర్లు, పచ్చబొట్ల సంస్కృతి, కమీషన్ల కక్కుర్తి.. ఇవన్నీ ఆ కుటుంబానివేనని ఆరోపించారు. ఆదిరెడ్డి వాసు తనపై ఏమేమి అభియోగాలు మోపాడో వాటిలో ఏ ఒక్కటి ఆధారాలతో నిరూపించినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఆదిరెడ్డి కుటుంబం మేయర్‌గా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా 16 ఏళ్ల రాజకీయ పదవులు అనుభవించారన్నారు. కానీ నగరానికి ఏమి అభివృద్ధి చేశారంటే చెప్పడానికి ఒక్కటి కూడా లేదన్నారు. ఎర్రన్నాయుడి కుమార్తెగా ఆదిరెడ్డి భవానీని సిటీ ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపిస్తే, ఆమె ప్రజల మధ్యకు వచ్చిందీ లేదు, ప్రజలకు సేవ చేసిందీ లేదన్నారు.

హోం ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి హోమ్ ఓటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు, సెక్టార్ అధికారులకు గురువారం సాయంత్రం జేసీ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ్ భరత్ మాట్లాడుతూ ఎన్నికలలో హోం ఓటింగ్ కోసం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. వాటి ప్రకారం సదరన్ ధ్రువపత్రాలు ఉన్న 18 ఏళ్లు నిండిన ఓటర్లు, 85 ఏళ్లు నిండిన వృద్ధులను గుర్తించి, వారికి హోం ఓటింగ్‌పై అవగాహన కల్పించాలని కోరారు. ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు రాలేని వారికోసం ఫారం 12డి ఫారాలు సిద్ధం చేయాలన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

కడియం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ కడియంలో గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుంటామని స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఎండీ వలీ, కడియం ఏపీఎం బి.అప్పలకొండ, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు డీవీ సింహాచలం, కె.విజయలక్ష్మిపాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా అమ్మవారి ఊరేగింపు


కడియపులంకలో ఊరేగుతున్న అమ్మవారు

కడియం: కడియపులంక గ్రామదేవత ముసలమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం అమ్మవారిని గరగ నృత్యాలు, మేళతాళాలు, కేరళ వాయిద్యాలు, వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలతో అంగరంగ వైభవంగా ఊరేగించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు, హారతులు సమర్పించారు.

సచివాలయ మహిళా పోలీసుల పాత్ర కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

కడియం: ఎన్నికల నిబంధనల అమలులో మహిళా పోలీసులు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని సచివాలయ మహిళా పోలీసులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహిళా పోలీసులు ప్రతి రోజూ గ్రామంలో పర్యటించాలన్నారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు కనిపిస్తే తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో నిఘాను ఏర్పాటు చేసి, ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే కొత్తగా ఓటు వచ్చిన వారికి దాని వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణలో జరిగేందుకు కృషి చేయాలన్నారు.

పోసికుమార్‌కు డాక్టరేట్


డాక్టరేట్‌ను అందుకుంటున్న ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్‌కు హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి వృద్ధులు, దివ్యాంగులకు అందిస్తున్న సేవలను గుర్తింపుగా ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ముత్యాల పోసికుమార్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

5 నుంచి ధాన్యం కొనుగోళ్లు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

కడియం: మండల పరిధిలో ఏప్రిల్ 5 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని తహసీల్దార్ రమాదేవి అన్నారు. ఈ మేరకు మండల ప్రత్యేకాధికారి సుజాత కుమారి ఆధ్వర్యంలో గురువారం మైత్రీ కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం విధివిధానాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద గోనె సంచులను ముందుగానే అందుబాటులో ఉంచాలన్నారు. సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ అమలు చేయాలన్నారు. సమావేశంలో రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	ది గోట్‌లైఫ్
సూర్యమినీ	క్రూ
సూర్యప్యాలెస్	నువ్వు - గాడ్జిల్లాఅండ్‌కాంగ్
స్వామి	టిల్లు స్క్వేర్
శివజ్యోతి	ఓంభీమ్‌బుష్...
అనుశ్రీ	గాడ్జిల్లా అండ్ కాంగ్
రాజా	గాడ్జిల్లా అండ్ కాంగ్
ఊర్వశి	కలియుగం, ప్రేమలు
రంభ	గాడ్జిల్లా అండ్ కాంగ్
మేనక	భీమా
అప్సర	టిల్లు స్క్వేర్
కుమారి	టిల్లు స్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	టిల్లు స్క్వేర్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	టిల్లు స్క్వేర్
కడియం	
వెంకటసూర్య	గాడ్జిల్లా అండ్ కాంగ్

శాస్త్రోక్తంగా విగ్రహాల ప్రతిష్ఠాపనా మహోత్సవం


విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా పూజలు చేస్తున్న పండితులు


స్వామివారిని దర్శించుకున్న చందన నాగేశ్వర్

కడియం: వీరవరంలోని హనుమ లక్ష్మణ సీతా సమేత శ్రీ కోదండ రామస్వామి, వేంకటేశ్వర స్వామి వార్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠాపనా మహోత్సవం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. పంచాయతీ కార్యాలయం వద్ద ఆలయాన్ని దాతలు, భక్తుల సహకారంతో ఇటీవలే పునర్నిర్మించారు. ఆలయంలో నూతన విగ్రహాలను ఉదయం 9.38 గంటలకు ప్రతిష్ఠించారు. వైఖానస ఆగమ పండితుడు ఖండవల్లి రాధాకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో 12 మంది వేద పండితుల సమక్షంలో ఈ కార్యక్రమంలో అత్యంత వైభవంగా జరిగింది. ప్రతిష్ఠ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

దర్శించుకున్న ప్రముఖులు

రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో చందన నాగేశ్వర్ పాల్గొన్నారు.

చదువుకు ఆర్థికసాయం


సుకన్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న చందన నాగేశ్వర్

కడియం: వేమగిరి గ్రామంలోని రాందాస్ పేటకు చెందిన కర్రి నూకాలమ్మ అనే వితంతువుకు ముగ్గురు ఆడపిల్లలు. వారిని చదివించేందుకు ఆమె ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ దృష్టికి వెళ్లింది. ఆయన వెంటనే స్పందించి గురువారం రాజమహేంద్రవరం వీఎల్‌పురంలోని తన కార్యాలయంలో ఆ పిల్లల చదువుకు ఆర్థిక సాయం అందజేశారు. పిల్లలను బాగా చదివించాలని నూకాలమ్మకు సూచించారు.

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ గ్రామంలోని కెల్ల సుకన్య కుటుంబానికి ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం అందజేశారు. కరోనాలో భర్తను కోల్పోయి, దివ్యాంగ కుమారుడు, కుమార్తెతో సుకన్య ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న చందన నాగేశ్వర్ ఆమె ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించారు. పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని, తన వంతు సహకారం అందిస్తానని చందన హామీ ఇచ్చారు.

టోఫెల్‌తో విద్యార్థులకు ఇంగ్లిషుపై ఆసక్తి


విద్యార్థినితో పాఠాలు చదివిస్తున్న డీవైఈవో నారాయణ

కంబాలచెరువు: ప్రాథమిక స్థాయి నుంచీ విద్యార్థులకు ధారాళంగా చదవడం, రాయడం, మాట్లాడడంపై అవగాహన కల్పించాలని రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి, టోఫెల్ జిల్లా నోడల్ అధికారి ఈవీవీబీఎస్ నారాయణ ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక నారాయణపురం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొందరు విద్యార్థుల చేత బుక్స్ చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లిష్‌పై విద్యార్థులకు ఆసక్తి పెంచేందుకు టోఫెల్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి జగన్ కృషి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ముద్దాల అను

రాజమహేంద్రవరం రూరల్: కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కార్మికుల పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను అన్నారు. బొమ్మూరు సెంటర్‌లో ఆయన అధ్యక్షతన గురువారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముందుగా ఆటో యూనియన్ నాయకులు ఎస్‌కే ఆలీ, ఎస్‌కే సమీరా, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగ రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ చేతుల మీదుగా కేక్ కట్ చేసి కార్మికులకు పంచారు. ఈ సందర్భంగా ముద్దాల అను మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉండి, రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా చెల్లుబోయిన వేణును, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి యెనుముల త్యాగరాజు, దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, జీపీఆర్ జెడ్పీ హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కాకులపాటి కుమార్, ట్రేడ్ యూనియన్ రాజమండ్రి రూరల్ కన్వీనర్ కామేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి రవికుమార్, కన్వీనర్ కేవీ సుబ్బారెడ్డి, సోమన శ్రీనివాస్, వల్లి శ్రీను మహిళా కార్మిక నేతలు రామలక్ష్మి, వెంకటలక్ష్మి, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మధురపూడి: కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో ఎస్సై డి.ఆనంద కుమార్ ఆధ్వర్యంలో గురువారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు ఉల్లంఘించిన వాహన చోదకులకు అపరాధ రుసుం విధించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

అన్ని విభాగాలూ సర్వం సిద్ధం

- జేసీ తేజ్ భరత్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- ప్రత్యేకంగా గదుల కేటాయింపు



రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం


రూరల్ తహసీల్దార్ కార్యాలయం


హెల్ప్‌డెస్క్‌లో విధులు నిర్వహిస్తున్న వీఆర్వోలు

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధిించలంచి 51–రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం పూర్తిస్థాయిలో సిద్ధమైంది. రాజమండ్రి రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంతో పాటు హెల్ప్‌డెస్క్, సి విజిల్ సెల్, కంప్లెయింట్స్ మానిటరింగ్ సెల్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎక్స్‌పెండేచర్ టీమ్, సింగిల్ విండో, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూమ్ తదితర విభాగాలను రూరల్ తహసీల్దార్ కార్యాలయంతో పాటు, వైటీసీ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. కేవలం రాజమండ్రి రూరల్ అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మాత్రం కలెక్టరేట్‌లోని జిల్లా జాయింట్ కలెక్టర్, రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తేజ్ భరత్ చాంబర్‌లో జరుగుతుంది. అసెంబ్లీ అభ్యర్థుల ప్రచారం, సభలు, ఇతర అనుమతులు కోసం సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి పర్మిషన్లను సైతం అందజేయడం జరుగుతుంది. రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ తేజ్‌భరత్ ఆధ్వర్యంలో సహాయ రిటర్నింగ్ అధికారులు పి.సాయిబాబు, జి.కోటయ్య, వైకేవీ అప్పారావు, బి.రమాదేవి నేతృత్వంలో అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు.

24 గంటల కాల్ సెంటర్

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో 24 గంటల పాటు కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థుల సందేహాలు, సలహాల కోసం కాల్ సెంటర్ నంబర్ 0883–2416005ను సంప్రదించవచ్చు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు


ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు

కంబాలచెరువు : ది రాజమండ్రి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా పజరిగాయి. అధ్యక్షుడిగా తవ్వల వీరేంద్రనాథ్, ఉపాధ్యక్షుడిగా ఎస్.స్వర్ణ పాప, జనరల్ సెక్రటరీగా రమేష్ పెల్లూరి, ట్రెజరర్‌గా కె.హనుమంతరావు, జాయింట్ సెక్రటరీగా ధర్నాల కోట వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ సెక్రటరీగా కాశి శ్రీనివాసరావు, లైబ్రరీ సెక్రటరీగా కొత్తపల్లి శ్రీనివాస్, లేడీ రిప్రజెంటేటివ్‌గా కొండేటి వరలక్ష్మి, 2, 5 ఇయర్స్ మెంబర్లుగా ఎంఆర్‌వీ మణికంఠ, అరుణ్ కుమార్ విజయం సాధించారు. సీనియర్ కమిటీ మెంబర్లుగా పీఎల్ఎస్ ప్రసాద్, తీడా ఆంజనేయులు, రామ్మోహన్, పిట్టా చంద్రశేఖర్, లేడీ మెంబర్‌గా ఎం.సత్యపద్మిని ఎన్నికయ్యారు. కాగా.. బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఎన్నికలు జరిగాయి. విజేతలను రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.